క్లుప్తంగా

రాష్ట్రస్థాయికి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థిని


ఆర్తిచంద్ర

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్ 9వ తరగతి విద్యార్థిని బాపని ఆర్తిచంద్ర టూడీ చిత్రలేఖనం పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. మెదక్‌లో జరిగిన కళాఉత్సవ్–25లో తన ప్రతిభను చాటి మొదటి స్థానంలో నిలిచింది. తాను చిత్రీకరించిన సేవ్ గర్ల్ చిత్రలేఖనంతో కళాఉత్సవ్ పోటీలలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ఆర్తిచంద్రను డీఈఓ రాధాకిషన్, చిన్నశంకరంపేట తెలంగాణ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వాణికుమారి అభినందించారు.

తపస్ మండల కమిటీ అధ్యక్షుడిగా శివకుమార్


శివకుమార్


రవికుమార్

నర్సాపూర్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని సంఘం డివిజన్ ఇన్‌చార్జి నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు రాంచందర్, కొండల్ తెలిపారు. మండల కమిటీ అధ్యక్షుడిగా శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా కృష్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారని తెలిపారు. వారితో పాటు ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, హర్షవర్ధన్‌రెడ్డి, కార్యదర్శులుగా చెన్నారెడ్డి, కిష్టయ్య, రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని వారు వివరించారు.

అనాథ పిల్లలను ఆదుకుంటా

ఎన్‌ఆర్‌ఐ చంద్రశేఖర్


చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

చిన్నశంకరంపేట(మెదక్): తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలను ఆదుకుంటానని చిన్నశంకరంపేటకు చెందిన ఎన్‌ఆర్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం పట్టంలోని బుడగజంగాల కాలనీకి చెందిన నలుగురు చిన్నారులు ప్రసాద్, కార్తీక్, మౌనిక, విష్ణుల పేరున రూ.5 వేల చొప్పున రూ.20 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో నిద్రబోయిన స్వామి, ఉడత శ్రీమన్, కల్యాణ్,రాజు ఉన్నారు.

'పేట'లో సెంట్రల్ లైటింగ్ సదుపాయం


సెంట్రల్ లైటింగ్ ఏర్పాటైన దృశ్యం

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో కొత్తగా సెంట్రల్ లైటింగ్ సదుపాయం ఏర్పాటైంది. గతంలో ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ చెడిపోవడంతో కొన్నేళ్లుగా పట్టణం పాక్షికంగా అంధకారంలో మగ్గుతుంది. ఈ మేరకు శనివారం బటర్ ఫ్లై లైట్లను పీసీసీ సభ్యుడు సుప్రభాతరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కృషితో సెంట్రల్ లైటింగ్ సదుపాయం కలిగిందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు వెంకట్, సీనియర్ నాయకుడు యాదగిరి పాల్గొన్నారు.

స్వీయ రక్షణ అవసరం

ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్


కరాటేలో మెలకువలు నేర్చుకుంటున్న వాలంటీర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థినులకు స్వీయ రక్షణ ఎంతో అవసరమని, దానికోసం కరాటే నేర్చుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని రాయిలాపూర్‌లో నర్సాపూర్ డిగ్రీ కళాశాల యూనిట్–1 ఆధ్వర్యంలో రెండోరోజు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ కల్యాణ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆత్మరక్షణలో కరాటే మెలకులు నేరిప్పించారు. దీంతోపాటు ఏక్ భారత్, శ్రేష్ట భారత్ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు, బాలకలపై అఘాయిత్యాలు, దోపిడీలు పెరిగిపోతున్నాయని చెప్పారు. స్వీయ రక్షణ కోసం కరాటేలో మెలకువలు నేర్చుకోవాలని చెప్పారు. బాలికలు భయం వీడి అన్ని రంగాలలో రాణించాలని కోరారు.

వసతులేవీ?

సమస్యలకు నిలయంగా 'జీఎంఆర్ కాలనీ'

- తాగునీరు, మురుగు కాల్వలు, విద్యుత్, రోడ్లు కరువు
- అధికారులు తనిఖీ చేసిన తీరని సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు


గడ్డపోతారంలోని జీఎంఆర్ కాలనీ

జిన్నారం (పటాన్‌చెరు): నూతనంగా ఏర్పడిన జీఎంఆర్ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. కాలనీలో కనీస వసతులు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. గడ్డపోతారం పట్టణ పరిధిలోని కాజీపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 181లో దాదాపు 1000 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇందులో దాదాపు 3 వేలపైగా జనాభాతో ఉన్నప్పటికీ కనీస వసతులు కల్పించకపోవడంతో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు.

అరకొర వసతులు..

జీఎంఆర్ కాలనీలో కనీస వసతులు లేక స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీలు, రోడ్లు లేకపోవడంతో పాటు అరకొర వసతులతోనే జీవనం కొనసాగిస్తున్నారు. కాలనీలో నిరుపేద కుటుంబాలు ఉన్నాయి. సమీపంలోని పారిశ్రామికవాడల్లో బతుకుదెరువు కోసం ఉపాధిని పొందుతూ స్థానికంగా జీవిస్తున్నారు. అయితే కనీస వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా కాలనీకి వెళ్లేందుకు బీటీరోడ్డు లేకపోవడం మట్టి రోడ్డు బురదమయంగా మారుతుంది.

నేటికీ తీరని సమస్యలు

2008లో జీఎంఆర్ కాలనీ ఏర్పాటైన నేటికీ సమస్యలు తీరడం లేదు. కాలనీలో సరైన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో పాటు రవాణా వ్యవస్థ ఇబ్బందికరంగా మారింది. అయితే అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి పర్యటించి కాలనీ సమస్యలను పరిశీలించారు. అనంతరం కాలనీలో అంగన్ వాడీ కేంద్రం, పాఠశాలలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కలెక్టర్‌కు విన్నవించినా.. ఇప్పటివరకు ఎలాంటి సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికీ కాలనీలో సరైన విద్యుత్ వ్యవస్థ, కార్మికుల కుటుంబాల చిన్నారులకు అంగన్ వాడీ, ప్రాథమిక పాఠశాలలు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కాలనీలో పర్యటించి కనీస వసతులను కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


రోడ్డు బురదమయం

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

న్యాయమూర్తి హేమలత



మాట్లాడుతున్న జడ్జి హేమలత

నర్సాపూర్: లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం ఉంటుందని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ఎం.హేమలత చెప్పారు. శనివారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. లోక్‌అదాలత్ తీర్పు అంతిమమని చెప్పారు. క్షణికావేశంలో ఇరు వర్గాలు తగదా పడి కేసులు నమోదు చేయించుకుని కోర్టుల చుట్టూ తిరగడం సమంజసం కాదన్నారు. ఇరువర్గాలు ఒక అంగీకారానికి వచ్చి లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకొని కలిసిమెలిసి జీవించాలని జడ్జి హితవు పలికారు. కార్యక్రమంలో ఏపీపీ రాఘవేందర్, ప్రభుత్వ సహాయ న్యాయవాది సుధాకర్, లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, న్యాయవాదులు మధుశ్రీ శర్మ, ఇక్బాల్ అలీజాఫర్, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగరాజు, రాజునాయక్, అరీఫ్ సాయిరాం, రవినాయక్ పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు చేయరా..?


జూకల్ శివారులో రోడ్డుపై ఏర్పడిన గుంత

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట నుంచి జూకల్ మీదుగా పాపన్నపేటకు వెళ్లే దారిలో రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జూకల్ శివారులో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై గుంత ఏర్పడింది. దీంతో పాటు బుంగ పడడంతో రోడ్డు కోతకు గురైంది. నిత్యం ఈ రహదారిపై నుంచి ఆటోలు, స్కూల్‌బస్సులు వెళుతుంటాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఎంపీడీఓ కార్యాలయం వద్ద దళిత సంఘాల నిరసన


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దళిత సంఘాల నాయకుల నిరసన

చేగుంట(తూప్రాన్): దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వేధింపులతోనే పొలంపల్లికి చెందిన లక్ష్మి మృతి చెందిందని, అతనిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ పొలంపల్లి పంచాయతీ కార్యదర్శి స్రవంతి లక్ష్మిపై పోలీస్ కేసు నమోదు చేయించి వేధించడంతో మృతి చెందినట్లు ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎంపీడీఓ.. పంచాయతీ కార్యదర్శిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, బాధిత కుటుంబానికి ఎకరా ప్రభుత్వ భూమిని అందిస్తామని తహశీల్దార్ శ్రీకాంత్ హామీ ఇచ్చారు. అంత్యక్రియల కోసం రూ. రూ.40 వేలు అందించారు. నిందితురాలు స్రవంతిపై కేసు నమోదు చేసి బాధిత కుటుంబీకులకు న్యాయం చేస్తామని ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి హామీ ఇవ్వడంతో దళిత సంఘాల నాయకులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు స్వామి, శేఖర్, మల్లేశం, లక్ష్మణ్, సాయిలు, స్వామి, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయండి

మెదక్ కలెక్టరేట్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని పార్ట్‌టైం వర్కర్లు రోజువారీ కూలీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మెదక్‌లోని ప్రభుత్వ బాలుర హాస్టల్ వద్ద వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తెచ్చిన జీఓ 64తో పార్ట్ టైం వర్కర్లకు అన్యాయం జరుగుతుందన్నారు.

తైబజార్ రద్దు చేయండి

ఎమ్మెల్యే మైనంపల్లి


క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

మెదక్‌జోన్/రామాయంపేట(మెదక్): తైబజార్‌లో అక్రమ వసూళ్లపై ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తైబజార్‌ను రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. తైబజార్ వసూలు పేరుతో రైతులు, చిరువ్యాపారులను దోపిడీకి గురిచేస్తున్న విషయాన్ని సాక్షి వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కాగా, మెదక్, రామాయంపేటలో ఎమ్మెల్యే చిత్రపటానికి రైతులు, చిరువ్యాపారులు పాలాభిషేకం చేశారు. రామాయంపేటలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సుప్రభాతరావు, యుగంధర్‌రావు, రమేశ్‌రెడ్డి, యాదగిరి, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం


జహీరాబాద్ కోర్టు ఆవరణలో కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి

జహీరాబాద్: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 207 కేసులు పరిష్కారమయ్యాయని లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవితాదేవి తెలిపారు. సీనియర్ కోర్టు విభాగంలో 109 కేసులు పరిష్కారమవ్వగా.. రూ.89,08,130 వసూలయ్యాయని వివరించారు.

323 కేసులు పరిష్కారం

జోగిపేట(అందోల్): స్థానిక సబ్ జూనియర్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన నేషనల్ లోకల్ అదాలత్‌లో కోర్టు పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, ఎక్సైజ్ స్టేషన్‌లకు సంబంధించి 323 కేసులు పరిష్కారమయ్యాయని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు పీపీ స్వాతి గౌడ్, న్యాయవాదులు నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీకాంత్, నర్సింలు, సీఐ అనిల్, వివిధ బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: కక్షిదారుల పరస్పర అంగీకారంతో పలు కేసుల్లో రాజీమార్గమే రాజమార్గమని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 482 కేసులను పరిష్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

హవేళీఘణాపూర్(మెదక్): ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సత్యనారాయణ, ప్రసాద్‌రెడ్డిలను హవేళీఘణాపూర్ గ్రామస్తులు సన్మానించారు. తమ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు సాయిలు, రాజిరెడ్డి, నరేందర్‌రెడ్డి, ఖాలేద్, రాంచంద్రం, నాగరాజు, దొమ్మాట రవి, లచ్చన్న తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం


కేజీబీవీలో ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

టేక్మాల్ (మెదక్): అందోల్‌లో నియోజకవర్గ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నికైన కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలమణిని సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శనివారం టేక్మాల్ కేజీబీవీలో నిర్వహించిన నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ బాలమణి మేడంతో పాటూ ఉపాధ్యాయులందరినీ ఘనంగా సత్కరించారు. ఇందులో గురుశ్యామల, మౌనిక, మోక్షిక, నవనీత, సంధ్య, సుప్రియ, రేణుక, సుజాత, సంతోషి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుకునూర్‌లో తాగునీటికి కటకట


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని కుకునూర్ గ్రామంలో మూడు రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు రాకపోవడంతో గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారు. దీంతో పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తోటల్లో 'ఉద్యాన' విద్యార్థినులు


అరటి పంట సాగు వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థినులు

జహీరాబాద్: మండలంలోని రంజోల్‌లో సాగులో ఉన్న వాణిజ్య పంటలను రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినులు పరిశీలించారు. శనివారం గ్రామీణ ఉద్యాన పని అనుభవ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రంజోల్‌లో సాగులో ఉన్న అరటి, అల్లం, బొప్పాయి, జామ, పసుపు తదితర పంటలపై విద్యార్థులకు శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్ వివిధ పంటల్లో వచ్చే చీడ పీడలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు రైతులతో మాట్లాడి సాగు చేస్తున్న పంటల మెలకువలుతెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్, విద్యార్థినులు మాయ, నవ్య, హర్షిత, మధులత, భార్గవి, అభినయ, లయ, అన్విత, హనీషా, కీర్తి, అనూష, రైతు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం


పవన్ కళ్యాణ్

వెల్దుర్తి(తూప్రాన్) : ఇంటినుండి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వల్లూరి లక్ష్మీనర్సమ్మ కుమారుడు పవన్ కల్యాణ్ శుక్రవారం ఉదయం తన బైక్‌పై మండల కేంద్రానికి వెళ్లాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో పాటు తల్లి ఫోన్ చేసినా స్పందించలేదు. ఈ క్రమంలో గ్రామస్తులు బైక్‌ను మండలంలోని మంగళపర్తి అటవీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో తల్లి లక్ష్మినర్సమ్మతో పాటు పలువురు బైక్ ఉన్న ప్రాంతంలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 14వ తేదీన మండలంలోని వెంకట్రావుపేట, రాజిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శరత్‌బాబు, ఏఈఈ సాయికుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు తగిలే చెట్లు కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనులు జరుగుతాయని దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

◆ పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయాలి

నర్సాపూర్: బీజేపీ రాష్ట్ర కమిటీ సూచించిన కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలు సమష్టిగా చేపట్టి విజయవంతం చేయాలని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రయ్య ఆధ్వర్యంలో శనివారం నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ సేవా పక్షం కార్యశాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 17న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజు నుంచి అక్టోబరు రెండవ తేదీ వరకు సేవా పక్షం కార్యక్రమం కింద పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దరమేష్‌గౌడ్, సురేష్, బాల్‌రాజ్, రాజు, శంకర్, యాదగిరి, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సేవా పక్షం సంబంధించి కార్యాశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పార్టీకి సంబంధించిన వివిధ కార్యక్రమాలను వివరించారు . కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సిద్ధిరాంరెడ్డి, బూత్ అధ్యక్షుడు కుమార్, మహేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు

◆ సెంట్రల్ సోలార్ లైట్ల బిగింపు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని నందిగామలో ఎంపీ నిధుల నుంచి గ్రామానికి సెంట్రల్ సోలార్ లైట్లను అందజేశారు. శనివారం ఓపెన్ జిమ్‌కు కేటాయించిన స్థలంలో సెంట్రల్ సోలార్ లైట్లను బిగించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, మండల అధ్యక్షుడు శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, అభిషేక్ రెడ్డి, నాలం నాగరాజు గౌడ్, భాజ దేవేందర్, కిషన్ నాయక్, స్వామి, మహేష్, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

◆ పది రోజులుగా నీళ్లు రావడం లేదు

నర్సాపూర్: మున్సిపాలిటీలోని ఎనిమిదవ వార్డులో పది రోజులుగా మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీళ్లు రావడం లేదని వార్డు ప్రజలు ఆరోపించారు. సింగిల్ ఫేజ్ బోరు మోటార్లు సైతం లేకపోవడంతో నల్లాల ద్వారా నీళ్లు రానందున తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని, మున్సిపల్ అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదని విమర్శించారు. తమ ఇబ్బందులను గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

◆ 17న కబడ్డీ సబ్ జూనియర్ జట్ల ఎంపిక

పాపన్నపేట(మెదక్): ఈ నెల 17న పాపన్నపేటలో కబడ్డీ సబ్ జూనియర్ జట్ల ఎంపిక జరుగుతుందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 28 వరకు నిజాంబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 16 ఏళ్లలోపు, 55 కిలోలకు మించి బరువు ఉండకూడదని సూచించారు. వివరాలకు 9010735121 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

◆ ఆలయ ప్రాంగణం పరిశుభ్రం

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో శనివారం పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కలిసి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో కృష్ణ, అనిల్, సాయిలు,భూషణం, రాజు, నరేష్, సుధాకర్,అంజయ్య, నర్సింలు తదితరులున్నారు.

◆ దామోదర్‌రెడ్డిని కలిసిన జిల్లా నాయకులు

మెదక్ కలెక్టరేట్: పీఆర్టీయూ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భిక్షం ఎన్నికవడం పట్ల ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పీఆర్టీయూటీఎస్ మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెదక్ మండల బాధ్యులు సుభాష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి , వీరేశం, పట్టణ బాధ్యులు రామకృష్ణ, సంతోష్ కుమార్, చంద్రశేఖర్, యాదవ రెడ్డి, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

◆ మదూర్ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా రాజ్‌కిరణ్

చిన్నశంకరంపేట(మెదక్): మదూర్ సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జిగా రాజ్‌కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్టర్‌గా పనిచేస్తున్న రాజ్‌కిరణ్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ కృష్ణా పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ పాలనలో ప్రజలు సతమతం

మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం శనిలా పట్టుకుందని బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు రతన్‌లాల్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. కనీసం తాగునీటి సరఫరా కూడా సరిగా చేయడం లేదన్నారు. యూరియా అందక రైతులు అరిగోస పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, బాబు, రవి, కిరణ్‌గౌడ్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయాల వద్ద అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న, కొట్టాల, కంచన్‌పల్లి గ్రామాలలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం వెల్మకన్నలోని శ్రీ బాలవీర హనుమాన్ ఆలయంలో ఆలయ పూజారి మెట్టురాములుశర్మ ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి చందన అలంకరణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నాదానం చేశారు.

◆ హాస్టల్ అభివృద్ధికి సూచనలివ్వండి

టేక్మాల్(మెదక్): హాస్టల్ అభ్యున్నతికి పోషకుల పాత్ర కీలకమైందని ఎస్సీ హాస్టల్ వార్డెన్ విక్రంస్వామి తెలిపారు. టేక్మాల్‌లోని ఎస్సీ హాస్టల్‌లో పోషకుల సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యాలు, ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు విద్యార్థుల బాగోగులను చూసుకోవడానికి తరచుగా హాస్టల్‌కు వస్తుండాలన్నారు. హాస్టల్ అభివృద్ధికి తమ సలహా సూచనలు అందించాలని కోరారు. ఇందులో సంక్షేమశాఖాధికారి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

◆ 16, 17 తేదీల్లో విశ్వకర్మ జయంత్యుత్సవాలు

నారాయణఖేడ్: పట్టణంలోని వడ్లగల్లీలోని కాళికా మాత ఆలయంలో ఈ నెల 16, 17 తేదీల్లో బోనాల ఉత్సవాలు, విశ్వకర్మ యజ్ఞమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వడ్ల బ్రహ్మం తెలిపారు. 16న బోనాలు, 17న కాళికా మాత అమ్మవారికి క్షీరాభిషేకం, విశ్వకర్మ విగ్రహస్థాపన, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.